క్లుప్తంగా

కానూరులో మదర్సా వార్షికోత్సవం



పెనమలూరు:తాడిగడప పురపాలక సంఘం కానూరు పాతచెక్‌పోస్టు పాము వెంకయ్య వీధిలో ఉన్న మదర్సా ఆల్ జామియా దారుస్సుఫ్ఫా మొదటి వార్షికోత్సవం గురువారం రాత్రి నిర్వహించారు. మత గురువులు హజ్రత్ మౌలానా అబ్దుల్ ఖాదిర్ సాహెబ్, అబ్దుల్ వహాబ్‌సాహెబ్ పాల్గొని మాట్లాడుతూ ఆధ్యాత్మిక విద్య ప్రాముఖ్యతను ఖురాన్ గ్రంథంలో బోధించిన అంశాలు వివరించారు. గురువు ఖారీ మొహమ్మద్ ఫహీమ్‌ఖాస్మీ నాజిమ్ దారుస్సుఫ్ఫాలో బాలలకు అందిస్తున్న విద్యను గురించి వివరించారు. హఫీజ్ విద్యను పూర్తి చేసుకున్న నలుగురు బాలలను మత గురువులు అభినందించారు.

ఉత్సాహంగా కేజీ గ్రాడ్యుయేషన్ డే



కంకిపాడు: ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్ కేజీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శుక్రవారం ఉత్సాహంగా సాగాయి. పాఠశాల ప్రిన్సిపాల్ జె.పద్మావతి యూకేజీ విద్యార్థులకు పట్టాలను అందజేసి అభినందించారు. ఆమె మాట్లాడుతూ భావి తరాలను వారి ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తే అద్భుతాలను సృష్టిస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.శ్రీవాణి, రమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

తెల్లమందారం మొక్కకు గులాబీ మందారం



కంకిపాడు: తెల్లమందారం మొక్కకు గులాబీ మందారం పూసింది. ఈడుపుగల్లు గ్రామంలోని సాయిశ్రీ నివాసంలో పెంచిన తెల్ల మందారం మొక్కకు పాల గులాబీ వర్ణంలో మందారం వికసించి అబ్బురపరుస్తుంది. జన్యుపరమైన మార్పులు, జన్యువు ఆధిక్యం కనబర్చినపుడు జరిగే మార్పుతో రంగు మార్పు వచ్చి ఉంటుందని ఏలూరు జిల్లా ఉద్యాన నిపుణులు జి.లక్‌పతి 'సాక్షి'కి తెలిపారు.

రోగులకు వైద్య పరీక్షలు

నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయిలో నెలకొల్పిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు నిర్వహించారు. శుక్రవారం నున్న గ్రామ సచివాలయం–2లో 95 మంది అవుట్ పేషెంట్లకు డాక్టర్ శ్వేత, వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులను అందజేశారు. గ్రామాల్లో అధికంగా బీపీ, షుగర్, వైరల్ ఫీవర్స్ ఉన్నట్లుగా గుర్తించారు. నెలలో మూడో శుక్రవారం కావడంతో 104 వాహనంలో వచ్చిన డాక్టర్ రేవతి బృందం ప్రత్యేకంగా ప్రజలకు వ్యానులోనే వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులను అందజేశారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఆరోగ్యశ్రీ పథకంలో కాలుకు ఆపరేషన్ చేయించుకున్న తిరుపతి రాంబాబు ఇంటికి వెళ్లి పరామర్శించారు. అవసరమైన మందులను అందజేశారు. అనంతరం వంద సంవత్సరాల వయస్సున్న రాజమణి ఇంటికి వెళ్లి నొప్పుల నివారణకు అవసరమైన మందులను ఇచ్చారు. సమీపంలో అంగన్‌వాడీ కేంద్రలో పిల్లలకు ఇస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుస్మిత, ఏఎన్‌ఎం లక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా చిరంజీవి బాధ్యతల స్వీకరణ



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని వీరవల్లి పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా ఎం.చిరంజీవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న యు.ఎల్.సుబ్రహ్మణ్యం హనుమాన్ జంక్షన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ–2గా బదిలీ కావటంతో ఆయన స్థానంలో నందివాడ ఎస్‌ఐగా పని చేస్తున్న చిరంజీవి నియమితులయ్యారు. వీరవల్లి ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు పోలీస్ స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు. జూద శిబిరాలను అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని పేర్కొన్నారు.

తపస్సుకాల కూటములు ప్రారంభం

ఉంగుటూరు: పెద అవుటపల్లి బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రంలో మూడు రోజులు పాటు జరిగే తపస్సుకాల కూటములు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాదులోని ముత్తంగి డివైన్ వార్డ్ సెంటర్ ఫాదర్ సిరిల్ దాసు నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవ ఆధ్యాత్మిక జీవితంపై దృష్టి పెట్టాలని బోధించారు. ఈ కార్యక్రమంలో పుణ్యక్షేత్ర రెక్టార్ ఫాదర్ సుధాకర్ లారెన్స్, ఫాదర్ కరుణాకర్ కాసు, ప్రవీణ్, సంఘస్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యం

- నాడు–నేడుతో పీహెచ్‌సీకి మహర్దశ
- మెరుగైన సదుపాయాలు కల్పన
- ప్రజలకు ఎంతో ప్రయోజనకరం



ఉప్పలూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనం

కంకిపాడు: నాడు–నేడు పనులతో ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి నూతన శోభ సంతరించుకుంది. ఆస్పత్రిలో వసతులు మెరుగుపడ్డాయి. ప్రాంగణం సర్వాంగ సుందరంగా మార్పు చెందింది. అంతేకాకుండా రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి రావటంతో ఇక్కడి గ్రామీణ ప్రాంత ప్రజలు రోగాల బారి నుంచి ఊరట పొందినట్లయింది.

కంకిపాడు నుంచి ఉప్పలూరుకు పీహెచ్‌సీ...

2010కి పూర్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కంకిపాడులో నడిచేది. కంకిపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ కావటంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరైంది. అప్పుడు మంత్రిగా ఉన్న కొలుసు పార్థసారథి చొరవతో ఉప్పలూరు గ్రామానికి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం కేటాయింపు జరిగింది. తదుపరి ఆసుపత్రి భవన నిర్మాణం జరిగి ఉప్పలూరు కేంద్రంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఇక్కడ ఇద్దరు వైద్యులు, ఆసుపత్రి, క్షేత్రస్థాయి సిబ్బంది 50 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటుగా మరో 50 మంది ఆశ కార్యకర్తలు కంకిపాడు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో విధుల్లో ఉన్నారు. సీజన్ వారీగా ఇంటింటి సర్వేలు, గ్రామాల్లోని వైద్య కేంద్రాల్లో ఉచిత వైద్య శిబిరాలను అందుబాటులోకి తీసుకెళ్లి ప్రజారోగ్య పరిరక్షణకు పీహెచ్‌సీ వైద్యబృందం, సిబ్బంది కృషి చేస్తున్నారు.

నాడు–నేడుతో ప్రగతి.....

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడును ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. ప్రభుత్వ వైద్యశాలలను నూతనంగా తీర్చిదిద్ది, మౌలిక వసతులను మెరుగుపర్చి వైద్యసేవలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ క్రమంలో సుమారు రూ.38 లక్షలు అంచనా వ్యయంతో ఆసుపత్రి భవనం మరమ్మతులు, అదనంగా సమావేశ మందిరం, రోగులకు ఓపీ రాసే విభాగం, బయో వేస్ట్ యూనిట్, ఆసుపత్రి భవనంలో వివిధ విభాగాలు అందుబాటులోకి వచ్చాయి. పీహెచ్‌సీలో ప్రతి రోజూ 60 నుంచి 80 మంది ఓపీ నడుస్తుంది. నెలకు 2000 నుంచి 2200 వరకూ రక్త పరీక్షలు జరుగుతున్నాయి. డెలివరీలు చేపడుతున్నారు. మౌలిక వసతుల కల్పన, మెరుగైన వైద్య సేవలతో గ్రామీణ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

రోగుల సంఖ్య పెరిగింది



ఆసుపత్రిలో సిబ్బంది కొరత లేదు. అన్ని విభాగాలకూ అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉన్నారు. పాముకాటు, కుక్కకాటు మందులు అందుబాటులో ఉన్నాయి. సీజనల్ వ్యాధులకు తగ్గట్టు మందులను రోగులకు అందేలా చూస్తున్నాం. వసతులు మెరుగుపడటంతో ఆసుపత్రికి రోగులు వచ్చే సంఖ్య పెరిగింది.

– డాక్టర్ డి.సుందర్‌కుమార్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, ఉప్పలూరు

ఆస్తిపన్నుపై పెనాల్టీ మాఫీ

- రూ.1.58 కోట్లు పెనాల్టీ రద్దు చేసిన ప్రభుత్వం
- ఇంటి యజమానులకు భారీ ఊరట



మున్సిపల్ కార్యాలయం

పెనమలూరు:తాడిగడప మున్సిపాలిటీలో నివాసితులకు ప్రభుత్వం భారీ ఊరట కలిగించింది. ఆస్తి పన్ను (ఇంటి పన్ను) పై యజమానులకు విధించిన అపరాధ రుసుం (ఇంట్రస్టు) రూ. 1.58 కోట్లు పూర్తిగా మాఫీ చేసింది. ప్రభుత్వం అపరాధ రుసుం మాఫీ చేయటం వలన యజమానుల పై పడిన భారం తొలగిపోనుంది. 2020 సంవత్సరం డిసెంబర్ 31వ తేదీన ఆర్డినెన్స్‌తో ప్రభుత్వం మున్సిపాలిటీగా ప్రకటించింది. తాడిగడప, యనమలకుదురు, కానూరు, పోరంకి గ్రామాలను విలీనం చేస్తు మున్సిపాలిటీగా ఆవిర్భవించింది. దీంతో కొత్తగా ఆస్తి పన్నులు వేశారు.

ఆస్తి పన్ను పై వివాదం..

కాగా తాడిగడప మున్సిపాలిటీలో పూర్తి స్థాయిలో సిబ్బంది కొరత కారణంగా 2021–2022, అలాగే 2022–2023 సంవత్సరాలకు ఆస్తి పన్నుల డిమాండ్‌లు సిబ్బంది సకాలంలో జారీ చేయలేదు. గతంలో పంచాయతీల పన్నులు రెంటల్ వ్యాల్యూ పై ఇంటి పన్నులు ఉండేది. మున్సిపాలిటీ ఏర్పడిన తరువాత ఆస్తిపన్నుగా మదించి పన్నులు (ప్రాపర్టీ ట్యాక్స్) విధించారు. దీంతో పన్నులు కొంతమేరకు పెరిగాయి. అయితే దీనికి తోడు పన్నులు సకాలంలో చెల్లించలేదని అపరాధ రుసుం (ఇంట్రస్టు) అదనంగా పన్నుల డిమాండ్ నోటీసుల్లో వడ్డించారు. వాస్తవానికి ఇంటి యజయానులకు పాత బకాయిలు చూపిస్తూ 2022–2023లో పన్నుల డిమాండ్ నోటీసులు ఇచ్చారు. ఈ నోటీసుల్లో పెనాల్టీ యజమానుల తప్పులేక పోయినా వడ్డించటంతో వివాదం తలెత్తింది. గత్యంతరం లేక చాలా మంది పన్నులు, పెనాల్టీతో కట్టారు.

ఎమ్మెల్యే దృష్టికి రావటంతో...

కాగా ఆస్తి పన్ను పై పెనాల్టీ వేయటంతో ఈ సమస్య ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి దృష్టికి వచ్చింది. ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడారు. తాడిగడప మున్సిపాలిటీ కొత్తగా ఆవిర్భవించిందని, డిమాండ్ నోటీసులు ఆలస్యంగా ఇచ్చారని ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారు. దీని పై స్పందించిన ప్రభుత్వం 2023 మార్చి 31వ తేదీ వరకు ఆస్తి పన్ను పై ఉన్న పెనాల్టీ పూర్తిగా రుద్దు చేసింది. నెలాఖరు లోపు పన్నులు చెల్లించితే పెనాల్టీ ఉండదు. వచ్చే ఆర్థిక సంవత్సరం 2023–2024 నుంచి పన్నులు చెల్లింపులో పెనాల్టీ ఉంటుంది.

పెనాల్టీ కట్టక్కర్లేదు



తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్నుల పై పెనాల్టీని ప్రభుత్వం రద్దు చేసింది. ఆలస్యంగా ఆస్తి పన్ను డిమాండ్ అందుకున్న వారు మార్చి 31వ తేదీలోగా పన్నులు పెనాల్టీ చెల్లించకుండా కట్టుకోవచ్చు.

ఎస్.ప్రకాశరావు, కమిషనర్

విద్యుత్ సమస్యల పరిష్కారానికే అదాలత్

సీజీఆర్ఎఫ్ చైర్మన్ విశ్రాంత న్యాయమూర్తి విక్టర్ ఇమ్మానుయేలు



సీజీఆర్ఎఫ్ చైర్మన విక్టర్ ఇమ్మానుయేలుకు సమస్యలు వివరిస్తున్న వినియోగదారులు

ఉయ్యూరు: విద్యుత్ సమస్యలను పరిష్కరించి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకే విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ (వినియోగదారుల హక్కుల ఫోరమ్) చైర్మన్ విశ్రాంత న్యాయమూర్తి విక్టర్ ఇమ్మానుయేలు అన్నారు. స్థానిక సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ అదాలత్ శుక్రవారం నిర్వహించారు. ఉయ్యూరు, తోట్లవల్లూరు, అవనిగడ్డ, చల్లపల్లి ప్రాంతాల నుంచి విద్యుత్ వినియోగదారులు, రైతులు అదాలత్‌కు హాజరై చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేలుకు సమస్యలను విన్నవించారు. కొత్త విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాల మార్పు, లో ఓల్టేజీ సమస్య, బిల్లుల్లో లోపాలు వంటి సమస్యలను అదాలత్ దృష్టికి తీసుకురావటంతో చైర్మన్ ఇమ్మానుయేలు విద్యుత్ శాఖ అధికారులతో ఆయా సమస్యలపై అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ చట్టాలపై అవగాహన కల్పించుకుని సేవలను పొందాలని కోరారు. విద్యుత్ వినియోగదారుల ప్రయోజనం కోసమే సీజీఆర్ఎఫ్ ఉందన్నారు. సీజీఆర్ఎఫ్ సభ్యులు వెంకటకృష్ణ, రాందాసు, సునీత, నజీర్, ఎస్ఈ మురళీమోహన్, ఉయ్యూరు ఈఈ సిహెచ్ రాంభొట్లు, డీఈలు రామకృష్ణ, శివనాగేశ్వరరావు, సుబ్రమణ్యేశ్వరరావు పాల్గొన్నారు. ఏఈ నాగమల్లేశ్వరరావు అదాలత్‌ను పర్యవేక్షించారు.

చెరకులో యాజమాన్య పద్ధతులు చేపట్టాలి

సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి



ఉప్పలూరులో చెరకు రైతులకు సూచనలు ఇస్తున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి

కంకిపాడు: చెరకు తోటల్లో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు చేపట్టాలని ఉయ్యూరు చెరకు పరిశోధనాస్థానం కీటక విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో శుక్రవారం ఆమె పర్యటించారు. గ్రామంలో సాగు చేసిన చెరకు తోటలను పరిశీలించారు. నీటి యాజమాన్యం సరిగ్గా లేని చెరకు తోటల్లో పీక పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ పీక పురుగు నియంత్రణకు ట్రాష్ మల్చింగ్ విధానం కింద నీటి తడులు వెంట వెంటనే అందించటం, సిఫారసు చేసిన పురుగు మందులను వాడటం ద్వారా నియంత్రించొచ్చన్నారు. పురుగు ఉధృతి తగ్గించటానికి 30 రోజుల వయస్సు గల పంట నుంచి 120 రోజుల వరకూ ఎకరాకు మూడు నుంచి నాలుగు చోట్ల ట్రైకోగామా కిలోనిస్ గుడ్లు ఉన్న ట్రైకో కార్డులను ఏర్పాటు చేయాలన్నారు. చెరకు కర్రలు చనిపోయినట్లు గుర్తిస్తే నివారణకు ఎసిఫేట్ ఒక గ్రాము లీటరు నీటికి, మోనో క్రోటోఫాస్ 1.5 మిల్లీలీటర్లు ఒకలీటరు నీటికి లేదా, కొరాజన్0.3 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి మొవ్వు తడిచేలా పిచికారీ చేస్తే పీకపురుగు నివారణ సాధ్యమవుతుందన్నారు. వ్యవసాయశాఖ పామర్రు ఏడీఏ బి.స్వర్ణలత, మండల వ్యవసాయాధికారి పిఎం కిరణ్, వీఏఏ సౌజన్య, రైతులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు అధికారి పార్థసారథి

హనుమాన్‌జంక్షన్ రూరల్: వేసవిలో నవధ్యాన్యాలు సాగు చేయటం వల్ల భూసారం పెరుగుతుందని, తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె.పార్థసారథి తెలిపారు. స్థానిక మహత్మగాంధీనగర్‌లోని రైతు భరోసా కేంద్రంలో బాపులపాడు, గుడివాడ, నందివాడ, పెదపారుపూడి మండలాల ప్రకృతి వ్యవసాయ విభాగం క్షేత్రస్థాయి సిబ్బందితో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులు తమ పంట పొలాల్లో వేసవిలో నవధాన్యాల సాగు చేపట్టేందుకు అవగాహన కల్పించాలని చెప్పారు. నవధాన్యాలను విత్తన గుళికలుగా తయారు చేసి పంట పొలాల్లో చల్లించాలని తెలిపారు. గ్రామ స్థాయిలో మహిళా సమాఖ్య సంఘాల్లో చురుగ్గా ఉన్న మహిళలతో ఎన్‌పీఎం షాపులు ప్రారంభించాలని చెప్పారు. నాలుగు మండలాల్లో 6217 మంది రైతులతో 8925 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం లక్ష్యంగా నిర్దేశించినట్లు పార్థసారథి తెలిపారు. ఏపీడీ నాగమల్లేశ్వరి మాట్లాడుతూ పీఎండీఎస్ కిట్లు తయారు చేసే రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.10 వేలు సబ్సిడీ అందిస్తున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయ శిక్షకులు గోళ్ల గంగరాజు, సాయినాథ్‌రెడ్డి, క్రిసి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి నుంచి చిన్నారి శస్త్రచికిత్సకు సాయం



సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలను అందజేస్తున్న పార్టీ నేతలు

గన్నవరం: వినికిడి సమస్యతో బాధపడుతున్న విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడుకు చెందిన ఐదేళ్ల చిన్నారి పున్నాన షర్మిలకు శస్త్ర చికిత్సల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 5.30 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో చిన్నారి తండ్రి శ్రీరామమూర్తికి సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాన్ని అందజేశారు. పుట్టుకతోనే వినికిడి సమస్యతో షర్మిలకు ఇటీవల గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. ఆ చిన్నారికి శస్త్ర చికిత్స చేసేందుకు సుమారు రూ.8 లక్షల వరకు ఖర్చు అవుతుందన్నారు. అంత మొత్తం చెల్లించలేని స్థితిలో ఉన్న శ్రీరామమూర్తి గ్రామ వైఎస్సార్ సీపీ నేతలు ద్వారా ఎమ్మెల్యే వంశీమోహన్‌ను కలిసి సమస్యను విన్నవించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సీఎంఓ కార్యాలయ అధికారులతో మాట్లాడారు. చిన్నారి శస్త్ర చికిత్సకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 5.30 లక్షలు విడుదల చేశారు. ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడిన ఎమ్మెల్యే మిగిలిన మొత్తం తన సొంత నిధులు చెల్లిస్తానని చెప్పి వెంటనే వైద్యం ప్రారంభించాలన్నారు. తన కుమారై వైద్యానికి నిధులు మంజూరు చేసిన సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీమోహన్‌కు శ్రీరామమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. బాపులపాడు ఎంపీపీ యర్రగొర్ల నగేష్, పార్టీ మండల కన్వీనర్ నీలం ప్రవీణ్‌కుమార్, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కేఎంఎంఎ. కలాం, పార్టీ నేతలు మెండెం రాంబాబు, తిరివీధి రంగారావు, సర్నాల ఆంజనేయులు, కొనసరాజు శశిధర్, షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత నైపుణ్యాలను పెంచుకోవాలి



మాట్లాడుతున్న చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి

రామవరప్పాడు: విద్యార్థులు ఉన్నత విద్యతో పాటుగా మంచి గుణాలు అలవర్చుకోవాలని విజయవాడ స్కూల్స్, ట్యుటోరియల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని శ్రీకస్తూరి విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం 35వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, ఏకాగ్రత, తోటి వారికి సహాయ పడటం, పట్టుదల వంటి గుణాలను కలిగి ఉండాలన్నారు. వీసీఎస్ అండ్ టీపీ కార్యదర్శి అనుమాటి చెన్నయ్య మాట్లాడుతూ అంతర్గత నైపుణ్యాలను పెంపొందించుకుని తమ లక్ష్యాలను సాధించాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు విభాగాల్లో విజేతలుగా నిలబడిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

పెనమలూరు: విద్యార్థిని అదృశ్యంపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం... పెనమలూరు ఆశ్రయం కాలువ కట్టపై డి.కృష్ణవేణి కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమె కుమార్తె (15) ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. అయితే బుధవారం తన ఫ్రెండ్ ఇంటికి వెళ్లివస్తానని బయటకు వెళ్లింది. ఆమె ఎంతకూ తిరిగి ఇంటికి రాక పోవటంతో విద్యార్థిని తల్లి పలు ప్రాంతాల్లో వెతికింది. ఆచూకీ లభించక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

కంకిపాడు: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ కె.సుధాకర్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో గురువారం అర్ధరాత్రి కంకిపాడు బైపాస్ మార్గంలో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలను నడుపుతున్న ఆరుగురిని గుర్తించి జరిమానాలు విధిస్తూ కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వ్యక్తులను గుర్తించి ఆరు కేసులను నమోదు చేశారు. ఎస్‌ఐ సుధాకర్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలను నడపటం వల్ల ప్రమాదాలు జరిగి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. కుటుంబ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని మద్యంకు దూరంగా ఉండాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. తనిఖీల్లో అదనపు ఎస్‌ఐ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవీఐపై దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలి

విజయవాడ స్పోర్ట్స్: కాకినాడలో మోటారు వాహన తనిఖీ అధికారి(ఎంవీఐ)పై కొబ్బరి బొండాల వ్యాపారి దాడి చేయడం బాధాకరమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీటీసీ ఎం.పురేంద్ర డిమాండ్ చేశారు. ఎంవీఐపై దాడిని ఖండిస్తూ డీటీసీ కార్యాయల ఉద్యోగులు శుక్రవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డీటీసీ మాట్లాడుతూ విధుల్లో భాగంగా వాహనాలు తనిఖీ చేస్తున్న ఎంవీఐ చిన్నారావుపై కొబ్బరి బొండాల వ్యాపారి పెంటా వెంకటకుమార్ కత్తితో కిరాతంగా దాడి చేయడం అమానుషమన్నారు. రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజబాబు మాట్లాడుతూ తనిఖీ సమయంలో వాహన రికార్డులను యజమానులు చూపించాలని, అధికారులు తప్పుగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలేగానీ భౌతిక దాడులు చేయడం సమంజసం కాదన్నారు. నిరసన కార్యక్రమంలో ఆర్టీవో ఆర్.జగదీశ్వరరాజు, అధికారులు ఎస్.శ్రీనివాస్, కె.ఎల్.బాబు, సి.హెచ్.శ్రీనివాసరావు, అబ్దుల్ సత్తార్, ఆర్.చంద్రకళ, బి.జ్యోతి, కె.రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో అన్నదాతలు



మంతెనలో మినుము గూళ్లపై పరదాలు కప్పుతున్న రైతులు

అకాల వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షానికి పనల మీద ఉన్న మినుము, పెసర గూళ్లు తడిచిపోయాయి. మినుము, పెసర కాయలు పగిలిపోయి గింజ వృథాగా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాయలు తడవటం, చలిగాలుల తీవ్రతకు బూజుపట్టి నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని వాపోతున్నారు. –కంకిపాడు



కంకిపాడు మండలం కోలవెన్నులో తడిచిన మినుము పనలు